# కనకదాసు

నేను ఆర్ట్స్ కాలేజీ ముందుకు వెళ్ళేసరికి ఉదయం పదిగంటలైంది. క్లాస్‌కు లేటవుతుందనే హడావిడిలో అడుగులు వేగంగా వేస్తున్నాను. నేను అక్కడికి వేళ్ళేసరికి ఆర్ట్స్ కాలేజీ ముందు నిలబడి కనకదాసు హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో ఎవర్నో కోపంగా తిడుతున్నాడు. బూతులు కూడా దొర్లుతున్నాయి.

కనకదాసుకు 30 ఏళ్ళపైనే వుంటాయి. యూనివర్శిటీ విద్యార్థులందరికీ అతను తెలుసు. అతను యూనివర్శిటీలో భీష్ముడు. అతను ఏ హాస్టల్‌కైనా వెళ్ళగలడు. ఏ మెస్‌లోనైనా తినగలడు. ఎక్కడైనా పడుకోగలడు. అతనికి ఎక్కడా అడ్డువుండదు. ఎవరూ అడ్డగించడానికి సాహసించరు. కదిలిస్తే విజ్ఞానంతో ఎదుటి వాళ్లను ఓడించగలడు. బూతులతో అవమానించగలడు. అవసరమైతే ఎదుటి వాళ్ళ పాకెట్ మనీ లోంచి డబ్బు తీసుకెళ్ళగలడు.

కనకదాసుకు మూడు పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీలున్నాయి. పి.హెచ్.డికి రిజిస్టర్ చేయించాడు రెండేళ్ళ కిందట - కాని అతను పి హెచ్ డి వర్క్‌చేస్తున్న దాఖలాలు మాత్రం నాకు కనిపించలేదు.

కనకదాసు గట్టిగా తిడుతూనే వున్నాడు. కారిడార్‌లో కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. చెట్లకింద, లాన్‌లో యువతీ యువకులు కలగాపులగంగా కూర్చొని ఎవరి గొడవల్లో వారున్నారు. ఎవరూ కనకదాసును పట్టించుకోవడం లేదు. పట్టించుకున్న కొద్దిమంది వెంటనే యథాస్థితిలోకి వెళ్ళి పోతున్నారు. ఎవరు కనకదాసు వైపు చూసినా వారినే తిడుతున్నట్లుగా వుంది. నేను కనకదాసునే చూస్తూ మెల్లగా నడుస్తున్నాను.

"హల్లో అభిమన్యూ!" అనే పలకరింపుకు ఉలిక్కి పడి చూశాను. శ్రీకాంత్.

"మనవాడెవర్నో తిడుతున్నాడు?" అడిగాను.

"ఆర్ట్సుకాలేజీని"

నాకు ఏం మాట్లాడాలో తోచలేదు.

"క్లాస్‌కా?" ప్రశ్నించాడు శ్రీకాంత్

"అవును" అన్నాను నీరసంగా

"ఏమిటి, ఇంతలోనే డల్లయిపోయావు?"

సమాధానమివ్వకుండా "వెళ్తా" అని చెప్పేసి అక్కణ్నుంచి కదిలాను.

ఏదో తెలియని ఆవేదన మనస్సును ఆవరించింది. ఆందోళన చెలరేగింది. కనకదాసు యూనివర్శిటీ సంకెళ్ళ నుంచి బయటపడి హాయిగా జీవించలేడా? నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. ఆ ఆర్ట్స్ కాలేజీ మెట్లెక్కే ఓపికకూడా నశించింది నాలో. నిస్సత్తువతో మెట్లెక్కి లోపలికెళ్ళాను.

రీసెర్చ్ స్కాలర్ రమణారెడ్డి కనిపించాడు. అతని సీనియారిటీకి భంగం కలిగించడానికి భయపడి "నమస్తే సార్!" అన్నాను.

"ఏమిటి విశేషాలు?" అడిగాడు రెండేళ్ళు ఎం.ఏ., ఏడాదిన్నర పాటు ఎం.ఫిల్ చేసి, రెండేళ్ళు గా పిహెచ్‌డి చేస్తున్నాడు రమణారెడ్డి. భుజానికి ఎప్పుడూ సంచీ వేళ్ళాడుతుంది. హాస్టల్‌లోనే వుంటాడు.

"ఏం లేవండి" అని ముందుకు వెళ్ళాను. మరింత భయమేసింది నాకు. వీళ్ళలాగే నేను కూడా ఏళ్ళతరబడి హాస్టల్‌లో వుండాల్సిందేనా అనే బాధ ఎక్కువైంది. క్లాస్‌కు వెళ్ళాలనిపించలేదు. వెనుదిరిగి క్యాంటిన్‌కు వెళ్ళి టీ తాగాను. సిగరెట్ అంటించుకొని హాస్టల్ వైపు మళ్ళాను.

ఆర్ట్స్ కాలేజీ బస్‌స్టాప్ వద్ద వున్న బండలమీద చతుష్టయం కన్పించారు. ఇద్దరమ్మాయిలు, ఇద్దరబ్బాయిలు - ఆ నలుగురు క్లాస్‌లకు అటెండవుతారో, లేదో - ఎప్పుడూ ఏదో ఒకచోట కన్పిస్తుంటారు - క్యాంటిన్‌లోనో, లాన్‌లోనో, ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లోనో, చెట్లకిందనో, రాళ్ళమీదనో - ఇద్దరు మగవాళ్ళు సిగరెట్ల మీద సిగరెట్లు పీలుస్తుంటారు. నవ్విస్తూ నవ్వుతుంటారు. ఒకరినొకరు చిలిపిగా కొట్టుకుంటుంటారు. వారికి వేరే ప్రపంచం పట్టనట్లే వుంటారు. చూడగానే ధన వంతుల బిడ్డలనిపిస్తుంది. వాళ్ళను చూసినప్పుడల్లా "ఆనందజీవులు వాళ్ళకే బాధాలేదు" అని ఈర్ష్య పడడం నాకు సహజం. కాని దాన్నిబయట పెట్టను. క్యాంటిన్లకు, సినిమాలకు, ఇతర విలాసాలకు ఇంకో మనిషికి ఖర్చు పెట్ట గలిగే స్తోమత లేదు నాకు. సిగరెట్లకే ఎంతో కష్టపడాల్సి వస్తుంది.

హాస్టల్ గేట్ దగ్గరకు వెళ్ళేసరికి - కాలేజీ ముందు నుంచి ఎప్పుడొచ్చాడో కనకదాసు కనిపించాడు.

"ఓ సిగరెట్టివ్వు, గురూ!" అని అడిగాడు.

జేబులో వున్న ఒకే ఒక సిగరెట్ తీసి అతనికి ఇచ్చేశాను. నా చేతిలో వున్న సిగరెట్ తీసుకొని అంటించుకున్నాడు. గట్టిగా పొగపీల్చి వదిలి నా సిగరెట్ నాకిచ్చాడు. ఆ తర్వాత వెంటనే మరో దమ్ములాగి "పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్" అంటూ వెళ్లిపోయాడు.

నేను హాస్టల్ కెళ్ళి మంచం మీద ఒరిగిపోయాను. వెల్లకిలా పడుకొని పైకి చూడడం మొదలెట్టాను. సాలెగూళ్ళు కనిపించాయి. బాధగానూ, బరువుగానూ వుంది.

రోజులు వెళ్ళిపోతున్నాయి. కాని కనకదాసు, రమణారెడ్డి నా ఆలోచనల్లోంచి వెళ్ళిపోలేదు. ఎన్నో ఏళ్ళుగా హాస్టల్స్‌లో వుంటున్న కురు వృద్ధులు నన్ను పీడిస్తూనే వున్నారు. నేను కూడా అట్లాగే అవుతానేమోననే వేదన వదలడం లేదు.

రాత్రి పన్నెండయింది. నేను, వి.ఎస్.రావు, చారి హాస్టల్ ముందు బండల మీద కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నాం.

"హమే తుమ్‌సే ప్యార్ కితనా ఏ హమ్ నహీ జాన్‌తే, మగర్ జీ నహీ సక్‌తే తుమారే బినా" అని పాడుకుంటూ కనకదాసు మాపక్క నుంచి వెళ్ళిపోయాడు. బాగా తాగి వున్నాడు.

"కనకదాసుకు వుద్యోగం దొరకలేదా?" అడిగాను నేను.

"ఇప్పుడా గొడవెందుకు?" అన్నాడు చారి

"హాస్టల్‌లో ఇలా ఎంతకాలం వుంటాడు? జీవితాన్ని వృధా చేసుకుంటున్నాడేమో!"

"పి.జి. పూర్తవ్వగానే ఉద్యోగాలేం దొరుకుతాయి. దానితో ఉద్యోగం వచ్చే వరకూ ఎం.ఫిల్. చేస్తాం. ఆ తర్వాత పిహెచ్‌డి చేస్తాం. పి.జి. అయిపోగానే ఎంఫిల్, దొరక్కపోతే మరో పిజీలో చేర్తాం. ఒక పి.జి. పూర్తిచేశాక మరో పి.జి. సంపాదించడం సులువే. లేదా ఎల్‌ఎల్‌బి, జర్నలిజం, బిఎల్‌ఐసి లాంటి కోర్సుల్లో చేర్తాం. ఎలాగో హాస్టల్ నుంచి వెళ్ళిపోకుండా చూసుకుంటాం. ఇట్లా రెండు, మూడు డిగ్రీలయి, పిహెచ్‌డి చేసే సరికి మన తల నెరిసిపోతుంది. కనకదాసుది అదే కేసు" వివరించాడు రావ్.

"కొందరు రెండు, మూడు డిగ్రీల తర్వాత ఏదో ఒక తీరున బయట పడ్డారు. రాజకీయాల్లోకి ప్రవేశించో, పెళ్ళికి కట్నం తీసుకొని వ్యాపారం పెట్టుకోనో - మరే విధంగానైనా పిజి డిగ్రీ ముగించి బయటపడేవారు చాలా తక్కువ" చెప్పాడు చారి.

"రేపు మనమూ అంతేనా?" భయంగా అడిగాను.

"నైంటీ పర్సెంట్ అంతే. కనీసం నాలుగైదేళ్ళు హాస్టల్‌లో వుండక తప్పదు."

నాలో బ్రతుకు భయం వటవృక్షంలా పెరుచుకుంది. మౌనంగా వుండిపోయాను.

"మాట్లాడవేం?" అడిగాడు రావు.

ఇంక అక్కడ కూర్చోలేకపోయాను. "వెళ్దామా?" అని లేచాను.

రాత్రి దాదాపు 9 గంటలవుతోంది.

కథా నిలయం
5040
శ్రీకాకుళం

ఓ పదిమంది దాకా మా రూంలో చేరారు. రాజకీయ చర్చలు, తరగతి గదుల వింతలు విశేషాలు ముగిసాయి. బూత్‌జోక్‌లు కుమ్మరించుకునే స్థాయిలో వున్నాం.

తలుపు తెరుచుకుంది.

అందరం ఒకేసారి అటు చూశాం. కనకదాసు తూలుతూ ప్రవేశించాడు. మాలో ఒకడు మళ్ళీ గది తలుపు మూసి వచ్చాడు. ఎవరం మాట్లాడలేదు.

"హల్లో మైడియర్ యంగ్ ఫ్రెండ్స్' అంటూ మొదలెట్టాడు కనకదాసు.

"వాడు ముసలోడు కదా - అందుకని మనల్ని యంగ్ ఫ్రెండ్స్ అంటున్నాడు" అనే మాట మాలోంచి వినిపించింది. ఎవరన్నారో పోల్చుకోవడం కష్టమే - అందరూ నవ్వారు. నాకు బాధేసింది "నవ్వకండిరా" అర్థించాను.

"వాడి మీద జాలి పెరిగిందేమిట్రా?" అని వేళాకోళమాడాడు వేణు. నాకు ఇంక మాట్లాడాలనిపించలేదు. కనకదాసు మీద నాకు జాలి పెరిగిందనే మాట నిజమే. కాని అంతకన్నా కనకదాసులా అవుతానేమోననే భయం, అలా కాకూడదనే తపన - అతని గురించిచెడుగా మాట్లాడడాన్ని ఇష్టపడనీయడం లేదు.

కనకదాసు మాట్లాడుతూనే వున్నాడు "హలో మైడియర్ యంగ్ ఫ్రెండ్స్, మీరంటే నా కెంతో అభిమానం - జాలి కూడా - మీ రిక్కడ వుండకండి - ఇప్పుడే వెళ్ళిపొండి - యూనివర్శిటీ లైఫ్ మత్తుమందులాంటిది. మార్క్స్‌కు ఈ విషయం తెలియదనుకుంటా"

"మనవాడు ఎన్‌సైక్లోపీడియారా" అన్నాడు మాలోంచి ఒకడు.

నేను మాట్లాడలేదు.

"సో........ నేనేం చెప్తున్నాను? ఈ యూనివర్శిటీ గురించి కదూ? ఇక్కడి ప్రొఫెసర్లు బయట ప్రపంచం దృష్టిలో మేధావులు. కాని వాళ్ళ మెదళ్ళకు పురుగులు పట్టినై. ఆ మెదళ్ళు పుచ్చిపోయినై. మస్కావాదులకు, కాకారాయుళ్ళకు ఇండివిడ్యూలిటీ లేని కొడుకులకు వాళ్ళు పెద్దపీట వేస్తారు. ఇంటలిజెన్స్‌ను గుర్తించరు. మీకు గుర్తింపు వుండదు. సో, మైడియర్ ఫ్రెండ్స్! లీవ్ దిస్ యూనివర్శిటీ యాజ్‌ఎర్లీ యాజ్ పాసిబుల్. డోంట్ వేస్ట్ యువర్ వాల్యుబుల్ టైం ఇన్ దిస్ డార్క్‌నెస్"

రాత్రి 12 గంటలైంది. అయినా కనకదాసు వదలడం లేదు. మాలో అసహనం పెరిగింది. భరించడం కష్టమైంది. అప్పటికి నాలుగైదుసార్లు అతన్ని బయటకు పంపించడానికి ప్రయత్నించాం. లాభం లేకపోయింది. మరోసారి ఎకనమిక్స్ స్టూడెంట్ రాము నడుం కట్టాడు - "మిస్టర్ కనకదాసూ! కెన్ యూ లీవ్ అజ్?" అడిగాడు.

"హూ హీజ్ దట్ మ్యాన్? ఐ యాం టెల్లింగ్ గోల్డన్ వర్డ్స్ - ఏమిటీ స్వర్ణాక్షరాలు! వాటిని మిస్ అయితే అది మీ దురదృష్టం. మీరు కూడా ఈ మురికి కూపంలో పడిపోవద్దనే నా ఆవేదన. ఐయాం ఎక్స్‌ప్రెసింగ్ దట్ ఓన్లీ. ఐ వాంటెడ్ టు పుల్ యు అవుట్. అది నా యాంబిషన్."

"నీ అవసరం మాకేమీ లేదు గాని వెళ్ళవోయ్" అన్నాడు వేణు.

"యూ ఆర్ ఇన్సల్టింగ్ మీ. ది వే ఆఫ్ టాకింగ్ ఈజ్ నాట్ గుడ్. నన్ను అవమానిస్తున్నారు. ఇట్ ఈజ్ వెరీ వెరీ బ్యాడ్ - సో, మీరు అపాలజీ చెప్పాలి."

"బోడిగాడివి నీకు అపాలజీ ఏమిట్రా?" వేణు కోపంగా అన్నాడు.

నేను వేణుగాడ్ని సముదాయించడానికి ప్రయత్నించాను. వాడు వినలేదు - "కనకదాసూ! ఇంతసేపు నీమీద జాలితో భరించాం. నువ్వు వెళ్ళక తప్పదు. లేదంటే థర్డ్ డిగ్రీమెథడ్స్ వాడాల్సొస్తుంది."

"హూ ఆర్‌యూ టుసే?" కొంచెం ముందుకొచ్చి గద్దించాడు కనకదాసు.

"ఏమిట్రా? నేనెవరో కావాల్నా చూపిస్తానుండు" అంటూ ముందుకొచ్చాడు వేణు. యుద్ధం మొదలయ్యే సూచనలు కనిపించాయి. నేను వేణును వారించబోయాను - వాడు వినలేదు. మాలోంచి ఇద్దరు, ముగ్గురు ముందుకు వచ్చి కనకదాసును బయటకు పంపించాడానికి ప్రయత్నించారు. అతను వినలేదు. పైగా ముందుకు తోసుకు రావడానికి ప్రయత్నించాడు. వేణుగాడూ అలాగే - కనకదాసును బలవంతంగా బయటకు లేపుకెళ్ళారు - హాస్టల్ ముందుదాకా. కనకదాసు గింజుకుంటూ లోపలికి తోసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడు - మా వాళ్ళు అడ్డగిస్తున్నారు. కనకదాసు అందర్నీ బూతులు తిడుతున్నాడు. ఈ గొడవలో కనకదాసు కింద పడిపోయాడు. లేచి మరింత గట్టిగా అందర్నీ బూతులు తిడుతున్నాడు. ఈ గొడవకు అందరూ గదుల నుంచి బయటకు రావడం మొదలెట్టారు. హాస్టల్ ముందు పెద్ద గందరగోళం తయారైంది. కనకదాసు మీద జోకులేసుకుంటూ నవ్వుకునే వాళ్ళు నవ్వుకుంటున్నారు. తిట్టుకునే వాళ్ళు తిట్టుకుంటున్నారు. బాధపడేవాళ్ళు బాధ పడిపోతున్నారు. కొందరు ఏం జరిగిందని అడుగుతున్నారు.

నాకు తల రెండుగా చీలిపోతున్నట్లన్పించింది. నుదురు చిట్లి పోతున్న బాధ, జుట్టు పీక్కోవాలనిపించింది. పిచ్చిగా అరవాలనిపించింది. యూనివర్శిటీ పెద్ద చీకటి జైలులా తోచింది. ఇక్కణ్నుంచి సాధ్యమైనంత త్వరలో బయట పడాలనే కోరిక మరింత బలపడింది. అక్కణ్నుంచి పారిపోవాలన్పించింది. అశాంతి మరింత పెరిగింది. ఈ ఆలోచనలో ఒక స్త్రీ అక్కడికి రావడం నేను గమనించలేదు. ఆమె కనకదాసును సమీపించి - మా అందరివైపూ చేతులు జోడించి "మావాళ్ణి ఏమీ అనకండి బాబూ" అని వేడుకుంది. "మీవైపు ఇక నుంచి

రానీయను. సాయంత్రం నుంచీ వాడి కోసం గాలిస్తున్నా." అని చెప్పి కనకదాసుతో "ఇదేం పనిరా, కనకం! ఇంట్లో వుండక ఇక్కడికెందుకొస్తావురా? పొద్దున చెప్పావు కదరా, ఇకనుంచి ఇటువైపు రానని. ఇంటికి పోదాం పద?" అని అంది. ఆమె గొంతు లోతులను గుర్తించడం కష్టమే అయింది. నాకు ఏడ్పొచ్చినంత పనైంది. కన్నీళ్ళు రాలాయి. ఎవరూ చూడకుండా తుడుచుకున్నాను.

"ఇక్కడికి రాకుండా ఉండలేక పోతున్నానమ్మా?" అన్నాడు కనకదాసు క్షమాపణ కోరుతున్నట్లుగా.

"పోదాం పద" అంది ఆమె.

"పద" అని తల్లిని అనుసరించాడు కనకదాసు. నిషా దిగిపోయింది.

మేము చూస్తూ వుండి పోయాం - కనకదాసు చేతిని పట్టుకొని అతని తల్లి నడిపించుకపోతోంది. వాళ్ళు కనుమరుగయ్యే దాకా చూస్తూ వుండిపోయాను.

*(1999లో ప్రచురించిన 'శిలువకు తొడిగిన మొగ్గ'*
*కథల సంపుటి నుంచి....)*